ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

తిరుపతి

జిల్లా వార్తలు

శనివారం 21 సెప్టెంబరు 2024

మనసు చివుక్కుమంటోంది

లడ్డూ వివాదంపై భక్తుల మనోగతం



తిరుపతి వెళ్లొచ్చామంటే.. మన చుట్టుపక్కల వాళ్లు అడిగే ప్రశ్న.. లడ్డూ ప్రసాదం ఎక్కడ? అందుకే తిరుమలకు వచ్చిన భక్తులు వీలైనన్ని ఎక్కువ లడ్డూలను తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు. తలాకొంచెం ప్రసాదంగా పెడతారు. ఇదీ కొండ లడ్డూకున్న ప్రత్యేకత. దీని రుచి, సువాసన ప్రపంచంలో మరే లడ్డూకు లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే తిరుమల లడ్డూకు పేటెంట్ దక్కింది. దాదాపు 310 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీవారి లడ్డూ ప్రసాదంపై వివాదం రగిలింది. లడ్డూలకు వినియోగించే ఆవు నెయ్యిలో జంతువుల కొవ్వు, చేప నూనె అవశేషాలు కలిశాయన్న ప్రచారంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మనసు చివుక్కుమంటోందని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు అలిపిరి, తిరుమలలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- తిరుపతి/తిరుమల,ఆంధ్రజ్యోతి



భరించరాని తప్పిదమిది

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం ఎప్పుడు జరిగినా భరించరాని తప్పిదమది. శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తులను మాత్రమే తనిఖీ చేయడం కాదు. అన్న ప్రసాదాలకు వచ్చే ముడిసరుకులను కూడా ల్యాబ్‌లో క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రతి వస్తువు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలి. ప్రభుత్వం మారిందికాబట్టి ఇకనైనా జాగ్రత్తలు తీసుకోవాలి.

- చంద్రిక, ప్రకాశం

ఏదైనా అపచారం జరిగితే ఆలయం శుద్ధి చేపట్టాలని ఆగమశాస్త్రంలో ఉంది. ఆగమ సలహా మండలి సభ్యుల ద్వారా సలహాలు తీసుకుని ఆ కార్యక్రమాలు చేపట్టాలి. అయితే ప్రస్తుతమున్న ఆగమ సలహామండలిలో ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వారికి స్వతంత్ర అభిప్రాయాన్ని చెప్పే ధైర్యం లేదు. వైఖానస ఆగమశాస్త్రంలో అనుభవం ఉన్న వారిని సంప్రదించి శుద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. శాస్త్రం ప్రకారం శుద్ధి చేసి స్వామిని తృప్తిపరిస్తేనే మనకు మేలు.

- రమణదీక్షితులు,
మాజీ ప్రధాన అర్చకుడు



ఎప్పుడూ వినలేదిలా..

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల గుడిలో ఇలాంటి అపచారం జరిగిందని ఎప్పుడూ వినలేదు. దేవుడి ప్రసాదంగానే భావిస్తున్నాం కాబట్టి అలాంటి వివాదాలను పట్టించుకోలేదు. నిజమని నమ్మడంలేదు. ప్రస్తుతం తీసుకున్న లడ్డూ ప్రసాదం బాగానే ఉంది.

- సుజాత, నెల్లూరు





ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

వెంకన్న లడ్డూ తయారీలోనూ కక్కుర్తి పడతారని ఎవరూ అనుకోలేదు. తెలిసి చేసినా, తెలియక చేసినా ఇది ఘోర తప్పిదమే. లడ్డూకు వాడిన నెయ్యి కల్తీగురించి సీఎం చంద్రబాబు చెప్పగానే ఇది నిజం కాకపోతే బాగుండు అనిపించింది. అయితే ల్యాబ్ రిపోర్టులోనూ నిర్ధారణ కావడంతో బాధ కలిగింది. దీనికి కారకులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- జగదీష్, నెల్లూరు



ఇప్పుడు లడ్డూలు బాగున్నాయి

ఐదుగురు మిత్రులతో కలిసి బెంగళూరు నుంచి తిరుమలకు వస్తున్నప్పుడే లడ్డూలో వాడే నెయ్యి కల్తీ విషయం తెలిసింది. చాలా బాధపడ్డాం. గతంలో కల్తీ నెయ్యితో తయారైన లడ్డూలు తిన్నవారు ఎంత మదన పడుతుంటారో? ఇప్పుడు మేము ఐదేసి లడ్డూల చొప్పున తీసుకున్నాం. ఇప్పుడు లడ్డూ బాగుంది.

- ముత్తువేలు, బెంగళూరు

నా గుండెల్లో బంగారుపాళ్యం



● పాదయాత్రను అడ్డుకునేందుకు వైసీపీ విఫలయత్నం ● తోడుగా నిలిచిన ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా ● మంత్రి లోకేశ్

బంగారుపాళ్యం/చిత్తూరు,ఆంధ్రజ్యోతి

బంగారుపాళ్యం నా గుండెల్లో ఉంటుంది. పాదయాత్రలో ఇక్కడ నాపైన డీఎస్పీ దాడి చేస్తే, లాఠీఛార్జికి ప్రయత్నిస్తే, స్టూల్ లాక్కుంటే ఇక్కడి ప్రజలే అండగా నిలిచారు. డీఎస్పీ తీరుతో కానిస్టేబుళ్లు కూడా సహాయనిరాకరణ చేశారు.పాదయాత్రలో మీరు నాపై చూపిన అభిమానానికి రుణం తీర్చుకోవడానికే ఈ రోజు ప్రజాప్రభుత్వంలో మంత్రిగా మీ ముందుకు వచ్చా' అని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.యువగళం పాదయాత్రలో వంద కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నిలబెట్టుకుంటూ శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని లోకేశ్ ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనాల్ని ప్రారంభించారు.ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. 'వచ్చే ఐదేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో ఎవరూ చేయని విధంగా 14 నియోజకవర్గాలను టచ్ చేస్తూ 45 రోజుల పాటు 577 కిలోమీటర్ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించింది. పాదయాత్రను అడ్డుకోవడానికి బంగారుపాళ్యంలో జగన్ ప్రభుత్వంలోని పోలీసులు ఎంత అరాచకం సృష్టించారో మీరంతా చూశారు.అప్పటి డీఎస్పీ అమరన్న చేయి పట్టుకున్నారు. నేను నిలదీస్తే నాపైనా కేసులు పెట్టారు. హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి 23 కేసులు నమోదు చేశారు.అంతేకాకుండా నా పాదయాత్రను అడ్డుకునేందుకు జీవో 1 విడుదల చేసి, ఇదే బంగారుపాళ్యంలో నా ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. నా గొంతు నొక్కాలని విఫలయత్నం చేశారు.ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువగళాన్ని ఆపడం వారి తరం కాలేదు.ఇక్కడి ప్రజల మద్దతుతోనే కుప్పంలో ప్రారంభమైన యువగళం పాదయాత్ర దండయాత్రగా మారింది' అని లోకేశ్ తెలిపారు.

లోకేశ్ పర్యటన విజయవంతం

తన పాదయాత్రలో ఇచ్చిన తొలి హామీని అమలు చేసేందుకు వచ్చిన మంత్రి లోకేశ్ పర్యటన విజయవంతమైంది. గురువారం రాత్రి తిరుపతి నుంచి బయలుదేరగా దారి పొడవునా నాయకులు, శ్రేణుల ఘన స్వాగతాలతో ఆలస్యంగా బంగారుపాళ్యానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయాన్నే పార్టీ శ్రేణులకు, అభిమానులకు సమయం కేటాయించి మాట్లాడారు.ఫొటోలు దిగారు. బంగారుపాళ్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో లోకేశ్‌కు అర్జీలు ఇవ్వడానికి, ఫొటోలు తీసుకోవడానికి పెద్దఎత్తున ప్రజలు ఎగబడ్డారు. సాయంపై.. సమస్యలపై పలువురు వినతులిచ్చారు. తిరుపతిలో అన్యాక్రాంతమైన హథీరాంజీ మఠం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని హథీరామ్ బావాజీ పరిరక్షణ కమిటీ కోరింది. ఇక, శ్రేణులతో విడిగా సమావేశమై ఉత్తమ కార్యకర్తల్ని అభినందించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.. మన టీడీపీ యాప్ ద్వారా ఉత్తమ పనితీరు చూపిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలందించారు. తిరుగుప్రయాణంలో గాదంకి టోల్‌ప్లాజా వద్ద కార్యకర్తలతో కలసి టీ తాగి.. పాదయాత్రనాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమరనాథ రెడ్డి, పులివర్తి నాని, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, అధికారులు పాల్గొన్నారు.

ఆకనంబట్టు పాఠశాల తనిఖీ

పూతలపట్టు: మంత్రి నారా లోకేశ్ శుక్రవారం మధ్యాహ్నం పూతలపట్టు మండలం ఆకనంబట్టు హైస్కూల్‌ను తనిఖీ చేశారు.8, 9, 10 తరగతుల గదులను సందర్శించి లోటుపాట్లపై విద్యార్థులతో మాట్లాడారు. బెంచీలు లేవని చెప్పగా, త్వరలో ఏర్పాటు చేస్తామని హామీయిచ్చారు. గతంలో టాయిలెట్స్ కంపుకొట్టేవని, ప్రస్తుతం పరిశుభ్రంగా ఉంటున్నాయని విద్యార్థులు చెప్పారు. ఇంకా పాఠ్యపుస్తకాలు అందలేదని చెప్పగా.. తక్షణమే అందించాలని అధికారులను ఆదేశించారు. పెచ్చులూడిన తరగతి గదులకు మరమ్మతులు చేయిస్తానన్నారు. టీచర్లతో సమావేశమైన ఆయన విద్యార్థుల హాజరు 70శాతం మాత్రమే ఉండడానికి కారణమేంటని తెలుసుకున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లలో విద్యార్థులు అనవసర కంటెంట్ చూస్తున్నట్లు ఫిర్యాదులు అందిన దృష్ట్యా వీటికి బదులుగా పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను అభివృద్ధి చేయడంపై పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

తిరుపతి ఆర్డీవోపై వేటు

● అవినీతి ఆరోపణల కేసులో చిక్కిన నిషాంత్‌రెడ్డి

● అప్పటి పుత్తూరు తహసీల్దారు, కలెక్టరేట్ సూపరింటెండెంటు కూడా సస్పెన్షన్



తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఓ పెట్రోల్ బంకుకు ఎన్వోసీ ఇచ్చేందుకు తన క్యాంప్ క్లర్క్ ద్వారా రూ.లక్ష డిమాండు చేశారన్న బాధితుడి ఫిర్యాదు, అనంతరం వివిధ దశల్లో జరిగిన సుదీర్ఘ విచారణ మేరకు ఆయన్ను సస్పెండు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వాపరాలను పరిశీలిస్తే.. పుత్తూరు సమీపంలో హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకు శ్రీనివాసులు కుటుంబానికి అన్ని అనుమతులతో మంజూరైంది. ఎన్వోసీ (నిరభ్యంతర పత్రం) కోసం ఫైలు ఆర్డీవో కార్యాలయానికి చేరింది. ఆర్డీవో నిషాంత్ రెడ్డి తన క్యాంప్ క్లర్క్ ద్వారా ఎన్వోసీ కోసం రూ.లక్ష డిమాండు చేశారని బాధితుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్వోసీ ఇవ్వాలని కలెక్టర్ సూచించినా మరోసారి తన సీసీ ద్వారా రూ.50వేలు వసూలు చేశారు. భూమార్పిడి కోసం మరో రూ.30వేలు డిమాండు చేయడంతో సీసీఎల్ఏకు ఫిర్యాదు చేశారు. దీంతో జేసీ శుభం బన్సల్‌తో విచారణ జరిపించగా, ఆయన ఆర్డీవోకు అనుకూలంగా నివేదిక ఇచ్చారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో సీసీఎల్ఏ సాయిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి విచారించాలని జేసీని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిషాంత్‌రెడ్డిలో కలవరం మొదలైంది. తనపై ఫిర్యాదుచేసిన బాధితుడి ఇంటికి రెవెన్యూ అధికారులను పంపి, ఫిర్యాదు వెనక్కి తీసుకోవాని ఒత్తిడి తీసుకొచ్చారు. దీనిపైనా మరోసారి సీసీఎల్ఏకు బాధితుడు ఫిర్యాదుచేశారు. ఈక్రమంలో ఆర్డీవోపై సస్పెన్షన్ వేటు వేసి కేసును ఏసీబీకి అప్పగించాలని సీసీఎల్ భావించింది.

కాగా, ఎన్నికలకు ముందు చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించడంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పటి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, సుధారెడ్డి దీనిపై పలుసార్లు ఫిర్యాదులు కూడా చేశారు. పోలింగ్ అనంతరం తిరుపతిలో జరిగిన గొడవలపై వైసీపీది ఎలాంటి తప్పులేనట్టుగా నివేదిక ఇచ్చారు. మరో ఏడాదిలో ఐఏఎస్‌గా పదోన్నతి లభించే అవకాశం ఉన్న అధికారి అవినీతి ఆరోపణలతో సస్పెండవడం చర్చనీయాంశమైంది. అలాగే, ఈ కేసులో అప్పటి పుత్తూరు తహసీల్దారు పరమేశ్వరస్వామి (ప్రస్తుతం అనంతపురం జిల్లా ఆత్మకూరు తహసీల్దారు), కలెక్టర్ కార్యాలయంలోని సంబంధిత సూపరింటెండెంట్ సురేష్‌బాబునూ సస్పెండు చేశారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీల హడావుడి

● దరఖాస్తుకు నేటితో ముగియనున్న గడువు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20: ఎక్సైజ్ శాఖలో బదిలీల హడావిడి నెలకొంది. సెబ్‌ను రద్దు చేసి.. ఎక్సైజ్‌లో విలీనం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎక్సైజ్ శాఖకు బదిలీల గడువు శుక్రవారంతో ముగియనుంది. దీంతో అధికారుల్లో హడావుడి మొదలైంది. దీంతో ఎవరి స్థానాలను వారు పదిలం చేసుకోవకానికి ప్రజాప్రతినిధులు, నాయకుల సిఫార్సు కోసం పలువురు తిరుగుతున్నారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట స్థానాల కోసం దాదాపు 15 మంది పోటీ పడుతున్నట్లు తెలిసింది. తిరుపతి అర్బన్, రూరల్ స్థానాల్లో నియామకానికి ఒక మంత్రి వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్న అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెలాఖరులోగా ఈ బదిలీల ప్రక్రియ పూర్తి కానుండడంతో దరఖాస్తుకు ముందే సిఫార్సు లేఖలు తీసుకు వస్తుండడంలో మంత్రులు, అధికారులకు ఎక్సైజ్ బదిలీలు తలకు మించిన భారంగా మారిందని ఓ అధికారి చెప్పారు. మరోవైపు గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులెవరనే దానిపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ హయాంలో అడిగినన్ని దర్శన టికెట్లు

● ఇప్పుడు పది మాత్రమే ఇచ్చారన్న ఆ పార్టీ ఎమ్మెల్యే విరూపాక్షి

తిరుమల, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో దర్శనానికి వస్తే ఎంతమందికైనా టికెట్లు ఇచ్చేవారని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు కేవలం 10 మందికి మాత్రమే దర్శన టికెట్లు ఇచ్చారని, తన కుటుంబ సభ్యుల్లోని మరో ముగ్గురికి ఇవ్వాలని ఎంత విన్నవించినా అధికారులు స్పందించలేదన్నారు. ఇది చాలా దారుణమని, కనీసం ప్రొటోకాల్ కూడా పాటించలేదన్నారు. తన భార్యను కూడా వదిలేసి దర్శనానికి వెళ్లాల్సి వచ్చిందన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలు తనలానే బాధపడుతున్నారన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధించాలి



ప్రత్యేక ప్రతిభావంతులతో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

పాకాల, సెప్టెంబరు 20: ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని డీఈవో శేఖర్ అన్నారు. దామలచెరువు జడ్పీహైస్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధించాలన్నారు. సైన్స్ ప్రాజెక్ట్ వర్క్స్ సరిగా చేయించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం రుచిచూశారు. అనంతరం మండల కేంద్రంలో భవిత కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సహాయ అకడమిక్ అధికారి మధుసూదన్, ఎంఈవో బాబ్జీ, భవిత కేంద్ర ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, సుందరి, సీఆర్పీలు శ్రీనివాసులు, జ్యోతి, శివకుమారి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కావలివారిపల్లెలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ చెంగల్రాయులు

పాకాల, సెప్టెంబరు 20: తల్లిపేరుతో ప్రతి ఒక్కరూ ఓ మొక్కనాటి సంరక్షించాలని సర్పంచ్ చెంగల్రాయులు కోరారు. మండలంలోని కావలివారిపల్లెలో శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సావిత్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బేబీరాణి, వార్డు సభ్యుడు వేణుగోపాల్, గుణశేఖర్, రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



నాయకులను సన్మానిస్తున్న చైతన్యకుమార్‌రెడ్డి

తిరుచానూరు, సెప్టెంబరు 20: తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలో బీజేపీ నాయకులు చైతన్యకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు రాటకొండ విశ్వనాథ్, వెంకటముని, గాలి పుష్పలత మాట్లా డుతూ పద్మావతిపురంలో సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.లక్ష్మణ్, మోహన్, యువత పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రీడల్లో మూడో స్థానంలో వెరిటాస్ స్కూల్



విద్యార్థులనుఅభినందిస్తున్న కరస్పాండెంట్ శేషారెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబరు 20: ఉభయ తెలుగు రాష్ట్రాల సీబీఎస్‌ఈ సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో ఆర్‌సీపురం వెరిటాస్ సైనిక్ స్కూల్ మూడో స్థానంలో నిలిచిందని కరస్పాండెంట్ శేషారెడ్డి తెలిపారు. అండర్-14 కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా రోహిత్, పూజిత ఉత్తమ క్రీడా కారులుగా నిలిచారన్నారు. అథ్లెటిక్స్‌లో అండర్-14 విభాగంగా 100 మీటర్ల పరుగుపందెంలో హృతిక్‌రోషన్, అండర్-19 విభాగం హై జంప్‌లో లక్ష్మి యోషిత బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వివిధ క్రీడల్లో సాయి సిద్ధార్థ, హరికృష్ణన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విజేతలను కరస్పాండెంట్ శేషారెడ్డి, డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ చక్రవర్తి, వైస్‌ప్రిన్సిపాల్ నాగార్జున అభినందించారు.

శ్రీశక్తిపీఠం చేరుకున్న సిద్ధేశ్వరానంద భారతిస్వామి



రామచంద్రాపురం, సెప్టెంబరు 20: చాతుర్మాస దీక్ష కోసం వారణాసి వెళ్లిన కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతిస్వామి దీక్ష ముగించుకుని నాలుగు నెలల అనంతరం శుక్రవారం రాయలచెరువు కట్ట శ్రీశక్తిపీఠానికి చేరుకున్నారు. భక్తులు స్వాగతం పలకగా వారిని ఆశీర్వదించారు.

వెంకట్రామాపురంలో 'ఇది మంచి ప్రభుత్వం'



రామచంద్రాపురం, సెప్టెంబరు 20: వెంకట్రామపురం పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఈవోపీఆర్డీ దేవిక ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వందరోజుల పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించి స్టిక్కర్లను అందజేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన : వేపకుప్పం పంచాయతీలో శనివారం జరిగే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి తెలిపారు.

మామిడిచెట్ల నరికివేతపై ఫిర్యాదు



మామిడిచెట్లను నరికేసిన దృశ్యం

రామచంద్రాపురం, సెప్టెంబరు 20: తన పొలంలో ఉన్న 15 మామిడిచెట్లను తన అనుమతి లేకుండా విద్యుత్ సిబ్బంది నరికేశారని ఆ సంస్థ ఎస్‌ఈ సురేంద్రనాయుడుకు ఓ మహిళా రైతు ఫిర్యాదు చేసింది.తిమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన జ్యోతికి చెందిన మామిడి చెట్లు విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్నాయని విద్యుత్ సిబ్బంది నరికేశారు. అయితే మామిడిచెట్లు విద్యుత్‌లైన్లకు చాలా ఎత్తులో ఉన్నప్పటికీ నరికేశారని ఆమె వాపోయారు.

చంద్రగిరి

నాగాలమ్మ ఆలయం వద్ద షాపు దగ్ధం

చంద్రగిరి, సెప్టెంబరు 20: చంద్రగిరి జాతీయ రహదారిలో నాగాలమ్మ ఆలయం వద్ద వున్న షాపు దగ్ధమైంది. పోలీసుల కథనం మేరకు.. గురువారం రాత్రి 11.45 నిమిషాలు తరువాత షాపులో మంటలు చెలరేగడంతో ఆదారిలో వినాయక నిమజ్జనానికి వెళుతున్న యువకులు చూసి మంటలను అదుపుచేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగిందా, లేక ఆకతాయిలు నిప్పు అంటించారా అనే విషయం తెలియడం లేదు. ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అభివృద్ధికి పచ్చజెండా

● ఎస్వీయూ పాలకమండలిలో పలు తీర్మానాలు



సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పాలకమండలి సభ్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20: ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధికి పచ్చజెండా ఊపుతూ పాలకమండలి పలు తీర్మానాలు చేసింది. యూనివర్సిటీలో శుక్రవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ సాగింది. పలు తీర్మానాలకు ఆమోదం లభించింది. సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ రామ్మోహనరావు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ కోల మంజుల, ప్రొఫెసర్ సుగుణమ్మ, ప్రొఫెసర్ పద్మనాభం, మొహిద్దీన్ బాషా, నారాయణబాబు పాల్గొన్నారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్, ప్రొఫెసర్ సుమకిరణ్, ఆర్థిక శాఖ ఉప కార్యదర్శి ఆదినారాయణ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

తీర్మానాలివే..

● మైక్రో బయాలజీ భవన నిర్మాణానికి రూ.1.02 కోట్ల నిధుల కేటాయింపు ● ఫార్మసీ భవన నిర్మాణానికి రూ.2. 8 కోట్ల కేటాయింపు ● నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్) ఏర్పాటుకు నిర్ణయం ● క్యాంపస్ స్కూల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.76. 80 లక్షల మంజూరుకు తీర్మానం ● పరిపాలనా భవనంలో గల నాలుగు అంతస్తుల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.85 లక్షల కేటాయింపు ● ఇంజినీరింగ్ విభాగంలో పదోన్నతులు కల్పించేందుకు చర్యలకు ఆదేశం ● దూరవిద్యా స్టడీ మెటీరియల్ ప్రింటింగ్ పెండింగ్ బిల్లుల విడుదల ● టీటీడీకి చెందిన మూడు కాలేజీలతో పాటు నగరి, చిత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా కల్పిస్తూ నిర్ణయం ● యూనివర్సిటీ దూరవిద్యా విభాగానికి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ లెర్నింగ్‌గా పేరు మారుస్తూ తీర్మానం ● దూరవిద్యా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు ఆమోదం.

టీ స్టాల్‌లో చిట్ చాట్

● యువగళం జ్ఞాపకాలను నెమరు వేసుకున్న లోకేశ్



అది చంద్రగిరి మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద టీ స్టాల్. గతేడాది ఫిబ్రవరి 18వ తేదీన యువగళం పాదయాత్రగా వచ్చిన లోకేశ్.. ఆ స్టాల్‌లో టీ తాగారు. కార్యకర్తలతో ముచ్చటించారు. శుక్రవారం మంత్రి హోదాలో బంగారుపాళ్యం పర్యటనలో పాల్గొని లోకేశ్ తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన కాన్వాయ్ గాదంకి టోల్ ప్లాజా వద్దకు చేరుకోగా అప్పటి విషయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రికి గుర్తు చేశారు. వెంటనే కాన్వాయ్ ఆపిన లోకేశ్.. పనపాకం గ్రామ పార్టీ అధ్యక్షుడు నగరం రమేష్‌కు చెందిన మురగన్ టీ స్టాల్లోకి వెళ్లారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి చాయ్ తాగుతూ యువగళం నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. దాదాపు అరగంట పాటు కార్యకర్తలతో చిట్ చాట్ చేశారు. ఆయన వెంట పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, నాయకులు మేడసాని కుమార్, తారాపతిరెడ్డి, వేణు, చెంచయ్యనాయుడు, గాలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

- చంద్రగిరి



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో మంత్రి సత్యకుమార్ యాదవ్

'పీఎం విశ్వకర్మ' పథకం ఒక వరం

● సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సత్యకుమార్ పిలుపు

తిరుపతి(విద్య),సెప్టెంబరు20: కులవృత్తులు చేసుకునేవారికి గొప్ప వరమైన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. చేతివృత్తులపై ఆధారపడే లక్షలాది మందికి అండగా నిలిచేందుకు ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. 18 రకాల చేతివృత్తుల వారికి ఈ పథకం ద్వారా నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఆర్థికంగా తోడ్పానందించి, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రధాని సహకారంతో విశ్వకర్మ పథకంతోపాటు మరిన్ని పథకాలకు, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.అనంతరం పీఎం విశ్వకర్మనైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులకు మంత్రి, ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. దీనికిముందు చేతివృత్తుల కళాకారులు ఏర్పాటుచేసిన కళాప్రదర్శనశాలలను సందర్శించి కళారూపాలను తిలకించారు.ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఈడీ దినేష్‌కుమార్, యూనియన్ బ్యాంక్ డీజీఎం రాంప్రసాద్,డీఐసీ జీఎం ప్రతాప్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలుపుతున్నారనే అంశంపై అన్ని రాజకీయ పార్టీలూ భగ్గుమంటున్నాయి. మనోభావాలు దెబ్బతినే ఈ అంశంపై నిజానిజాల నిగ్గుతేల్చి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

మఠాధిపతులూ మౌనం వీడండి!



తిరుమల శ్రీవారి లడ్డూపై ప్రపంచ వ్యాప్తంగా హిందువులు ఆందోళన చెందుతూ ఉంటే దేశంలోని మఠాధిపతులు, పీఠాధిపతులు, తిరుమలలోని పెద్ద జీయర్, చిన్నజియర్ స్వాములు ఎందుకు మౌనంగా ఉన్నారు? కమీషన్ల కోసం కక్కుర్తిపడి నాణ్యతలేని నెయ్యితో లడ్డూలు తయారు చేశారు. జగన్ ప్రభుత్వంలో టీటీడీలో సకల శాఖల అధికారిగా వ్యవహరించిన కీలక అధికారిపై 24గంటల లోపు చర్యలు తీసుకోవాలి.

-నవీన్ కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

గుంట నక్కలను వదలొద్దు



జూలైలో ఘటన జరిగినా అప్పటి మాజీ ఈవో, ఛైర్మన్లపై ఇంతవరకు ఎందుకు ఫిర్యాదులు చేయలేదు. సరఫరా చేసిన సంస్థపై చర్యలెందుకు తీసుకోలేదు. ఇందులో పాత్రధారులు, సూత్రధారులు అందరూ జైలుకు వెళ్లడం ఖాయం. ఈ గూడుపుఠాణీ వెనుక ఉన్న గుంట నక్కలను వదలొద్దు. వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తాం.

- దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏం సమాధానం చెప్పాలి?



ప్రతినెలా వెంకన్న లడ్డూలను దుబాయ్‌లోని అనేక ప్రాంతాల్లో ఉండే భారతీయులకు ప్రసాదంగా అందిచేవాడిని. ఇప్పుడు వారు లడ్డూ కల్తీ గురించి అడుగుతూ వుంటే తిరుపతి స్థానికుడిగా ఏమి చెప్పాలో అర్థంగాక ఆవేదన కలుగుతోంది. భక్తుల మనోభావాన్ని, నమ్మకాన్ని వమ్ము చేసిన వారిని శ్రీవారు కఠినంగా శిక్షిస్తాడు.

- డాక్టర్ ముక్కు తులసీకుమార్, ఎన్ఆర్ఐ, దుబాయ్

సంయమనంతో వ్యవహరించాలి



భక్తులకున్న సందేహాల నివృత్తికి ఉన్నత స్థాయిలో సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలి. తిరుమల పరిణామాలపై రాజకీయ పార్టీలు, ప్రజా, హిందూ సంఘాలు సంయమనంతో వ్యవహరించకపోతే టీటీడీ ప్రతిష్ఠకు నష్టం చేకూరుతుంది. ఈ ఘటనను ఆధారం చేసుకుని మతభావాలను రెచ్చగొట్టేందుకు కొందరు ఓ పథకం ప్రకారం చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు, ఉద్యోగులు తిరస్కరించాలి.

- కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి

వరద బాధితులకు రూ.25 వేల విరాళం



చంద్రగిరి, సెప్టెంబరు 20: విజయవాడ వరదబాధితుల కోసం పనపాకం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నగరం రమేష్ రూ.25 వేల నగదును మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు బాలకృష్ణమూర్తి, మేడసాని కుమార్, చెంగల్రాయులు, జేడీ ప్రసాద్, గురవయ్య, గంగాధరం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేము రూ.10 లక్షల విరాళం



మంత్రి నారా లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న చంద్రశేఖర నాయుడు

పూతలపట్టు, సెప్టెంబరు 20: విజయవాడలో వరదల కారణంగా వీధిన పడ్డ బాధితుల సహాయార్థం పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు రూ.10లక్షల విరాళమందజేశారు. శుక్రవారం బంగారుపాళ్యానికి వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను కలసి విరాళానికి సంబంధించిన చెక్‌ను అందజేశారు. ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్మోహన్, మాజీ కార్పొరేటర్ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు పార్లమెంటు వైసీపీ పరిశీలకుడిగా చెవిరెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 20: వైసీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకులుగా చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఒంగోలు పార్లమెంటులో వైసీపీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తానని చెవిరెడ్డి తెలియజేశారు.

జగన్‌రెడ్డికి జైలు ఖాయం

● కరుణాకరరెడ్డి, వైవీలకూ అదేగతి

● వైసీపీకి పుట్టగతులుండవన్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 20: వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన 'పీఎం విశ్వకర్మ పథకం' ప్రథమ వార్షికోత్సవ సభలో ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసే లడ్డూలో జంతు కొవ్వు పదార్థాలు కలిశాయన్నారు. విచారణ పూర్తయిన తరువాత జగన్‌రెడ్డి జైలుకు వెళ్తారని, భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలకూ అదేగతి పడుతుందన్నారు. శ్రీవారి లడ్డూలో జంతు కొవ్వు పదార్థాలకు సంబంధించిన ఆధారాలను సీఎం చంద్రబాబునాయుడు చూపించినాకూడా వైసీపీ నేతలు తిరిగి విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వైసీపీకి ఇక పుట్టగతులు ఉండవన్నారు.

శ్రీసిటీకి ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగరాజన్

శ్రీసిటీ, సెప్టెంబరు 20: శ్రీసిటీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సంస్థ వారి సీఎఫ్‌వో ఎక్సలెన్స్ అవార్డు శ్రీసిటీ ఫైనాన్షియల్ చీఫ్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) ఆర్.నాగరాజన్‌కు దక్కింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన సదరన్ రీజియన్ సీఐఐ సీఎఫ్‌వో ఎక్సలెన్స్ అవార్డుల మూడవ ఎడిషన్‌లో ఈ అవార్డును అందజేశారు. సీఐఐ మాజీ ప్రెసిడెంట్, ఇన్ఫోసిస్ కో ఫౌండర్, యాక్సిలర్ వెంచర్స్ ఛైర్మన్ క్రిస్ గోపాల కృష్ణన్, సీఐఐ సీఎఫ్‌వోఎక్సలెన్స్ అవార్డ్ 2023-24 ఛైర్మన్, భారత్ వోల్వో గ్రూప్ ప్రెసిడెంట్ అండ్ ఎండీ కమల్‌బాలి చేతుల మీదుగా అవార్డును స్వీకరిం చారు. మౌలిక కల్పన రంగంలో ఆర్థిక రంగం నిపుణుడిగా నాగరాజన్ చూపిన ప్రతిభ, కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది.

ఏపీటీఎఫ్ సదస్సును విజయవంతం చేయండి

తిరుపతి(విద్య), సెప్టెంబరు20: స్థానిక అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమేష్, ఎస్.సురేష్ పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, ప్రాథమిక విద్యపై చూపుతున్న ప్రభావాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎక్కువ సంఖ్యలో టీచర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20 : తిరుపతికి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి శుక్రవారం ఒక హోటల్లో మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. వైద్య ఆరోగ్యశాఖలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

సీఎంకు మాజీ సైనికుల సంఘం అభినందనలు

తిరుపతి(ఆటోనగర్) సెప్టెంబరు20: రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై మాజీ సైనికుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్, వాసాచారి, కిషోర్‌లు అభినందనలు తెలిపారు. కొన్ని రోజుల క్రితం తాము ఇచ్చిన వినతిని పరిశీలించిన సీఎం ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. అలాగే మంత్రులు కె.పార్థసారథి, నారా లోకేశ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో కాంతారావు, నాగ ప్రసాద్ ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబరు 20: బాలింతలు, గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసు కోవాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. శుక్రవారం మిట్టూరు కమ్యూనిటీ భవనంలో పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. పౌష్టికా హారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో శ్రీనివాసులు, సీడీపీవో ప్రదీప, ఈవోపీఆర్డీ దేవిక, టీడీపీ జిల్లా నాయకులు జనార్ధన్ చౌదరి, జేడీ జగన్, సర్పంచ్ కావ్య వేణుగోపాల్‌నాయుడు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పావని, రేవతి పాల్గొన్నారు.

చింతగుంట స్కూల్లో ఎంఈవో విచారణ

ఎర్రావారిపాళెం, సెప్టెంబరు 20: ఎర్రావారిపాళెం మండలంలోని చింతగుంట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈవో బాలసుబ్రమణ్యం విచారణ చేపట్టారు. 4వ తరగతి విద్యార్థి సాదిక్‌ను ఉపాధ్యాయుడు భాస్కరనాయుడు కొట్టినట్లు ప్రచారం జరగడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆయనీ విచారణ జరిపారు. విద్యార్థి తల్లి రేవతిని విచారించగా అలాంటిదేం జరగలేదని చెప్పిందని ఎంఈవో తెలిపారు. పాఠశాల హెడ్‌మాస్టర్ సుబ్బరాజును విచారించగా భాస్కర నాయుడు పిల్లలకు శ్రద్ధగా చదువు చెబుతున్నట్లు తెలిపారన్నారు.

టెక్నాలజీతో సుస్థిర వ్యవసాయం



అనంతపురం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు రవిని సన్మానిస్తున్న దృశం

చంద్రగిరి, సెప్టెంబరు 20: ఆధునిక టెక్నాలజీతో సుస్థిర వ్యవసాయం సాధ్యమని అనంతపురం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు రవి పేర్కొన్నారు. ఎ.రంగంపేట సమీపంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో సుస్థిర వ్యవసాయం కోసం పునరుత్పాదక శక్తి, డిజిటల్ సాంకేతికతను సమీకృతం చేయడంపై ఆవిష్కరణలు, అనువర్తనాలు అంశంపై సదస్సు నిర్వహించారు. డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, మోహన్‌బాబు యూనివర్సిటీ రూరల్ డెవలప్‌మెంట్ క్లబ్ సహకారంతో ఈ సదస్సు నిర్వహించారు. వాతావరణ సవాళ్లను ఎదుర్కొనడం, ఆహార భద్రతకు తోడ్పడేందుకు కచ్చితత్వ వ్యవసాయం, స్మార్ట్ నీటి పారుదల వ్యవస్థలు, పునరుత్పాదక ఇంధన అనుసంధానం తదితర కీలక ఆవిష్కరణలపై చర్చించారు. అగ్రికల్చర్ డీన్ డాక్టర్ గిరిధరకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ సుజాత పాల్గొన్నారు. కార్యక్రమం కన్వీనర్లుగా టీవీ సాయిత్రినాథ్, సురేష్‌బాబు వ్యవహరించారు.

శ్రీవారి సేవలో





శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న మాజీ ఎంపీ సుబ్బిరామిరెడ్డి, సినీ దర్శకుడు కొరటాల శివ. 'దేవర' సినిమా విడుదలకు ముందు కాలిబాటన వచ్చిన స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.96 కోట్లు

తిరుమల, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.4.96 కోట్ల ఆదాయం లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఇక గురువారం 68,835 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,883 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఈ మేరకు టీటీడీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.



తిరుపతి విమానాశ్రయంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన చిత్తూరు మాజీ ఎంపీ దివంగత నారమల్లి శివప్రసాద్ మనవడు కేతన్ శివప్రీతమ్

మెకానిక్‌ల సంక్షేమమే కార్మిక శాఖ లక్ష్యం



మెకానిక్‌లనుద్దేశించి మాట్లాడుతున్న చిన్న లాలప్ప

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 20: మెకానిక్‌ల సంక్షేమమే కార్మిక శాఖ లక్ష్యమని ఆ శాఖ కమిషనర్ చిన్న లాలప్ప అన్నారు. గాంధీభవన్ ఆవరణలో తిరుపతి టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ నెలవారీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మెకానిక్‌లు కార్మిక శాఖలో సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. కార్మిక శాఖ అధికారులు ప్రవీణ్‌కుమార్, శ్రీమన్నారాయణ రాజయ్య, తిరుపతి టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి, కార్యదర్శి జలంధర్, ప్రభు, గౌస్‌బాషా పాల్గొన్నారు.

బీసీల బాంధవుడు చంద్రబాబు



సమావేశంలో సదాశివం

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 20: సీఎం చంద్రబాబు బీసీల బాంధవుడిగా నిలిచారని టీడీపీ బీసీ సెల్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలు అణచివేతకు గురయ్యారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్, బీసీల రక్షణ చట్టం రూపకల్పనకు, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి మంత్రివర్గ సమావేశంలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపడం పట్ల బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. నూతన మద్యం పాలసీలో గీత కార్మికులకు 10 శాతం, బీసీ స్టడీ సర్కిల్ బలోపేతానికి రూ.10 కోట్లు, మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసేలా గత ప్రభుత్వ 217 జీవో రద్దు, దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణుల జీతం రూ15 వేల నుంచి రూ.25వేలకు పెంపు వంటి నిర్ణయాలు బీసీలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. సమావేశంలో బీసీ నాయకులు విశ్వనాథం, సత్యవతి, అశోక్, శ్రీరాములు, ఆముదాల తులసీదాస్, తంజావూరు రామయ్య పాల్గొన్నారు.

మద్యం టెండర్లలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 20: నూతన మద్యం దుకాణాల టెండర్లలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని వైసీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు తలారి రాజేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మద్యం దుకాణాల్లో ఎస్సీ, ఎస్టీలకు 10 శాతం, గీత కార్మికులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారని, అదే తరహాలో ఇక్కడా ఇవ్వాలని కోరారు.

మానసిక రోగులకు అండగా 'మనోబంధు'

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 20: మానసిక రుగ్మతలతో బాధపడుతూ నిరాశ్రయులైన వారికి మనోబంధు ఫౌండేషన్ అండగా ఉంటుందని రామకృష్ణమరాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రోడ్లపై తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి, తెలియజేస్తే వారిని మానసిక చికిత్సా కేంద్రానికి తరలించి మామూలు మనుషులుగా సమాజానికి పరిచయం చేస్తామన్నారు. కడపలోని మానసిక చికిత్స కేంద్రంలో 250 మందికి చికిత్స అందిస్తున్నారన్నారు. తమతో కలిసి వచ్చే స్వచ్ఛంద సేవా సంస్థలు, సేవకులు 9246563738కు సమాచారం అందించాలని కోరారు.

రద్దీకనుగుణంగా బస్సులు నడపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 20: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని కడప జోన్ ఈడీ చెంగల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో డిపో మేనేజర్లు, ఇతర విభాగాధికారులతో సమీక్షించారు. భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని, బస్సుల కండిషన్ తరచూ తనిఖీ చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ఎక్కువ ట్రిప్పులు తిప్పేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. బస్టాండ్లలో భద్రతను మరింత పటిష్ఠం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సీటీఎం ఎం.భాస్కర్, సీఎంఈ నరసింహులు, నెల్లూరు జోన్ వీ అండ్ ఎస్వో ధర్మతేజ, పీవో షహజాద్, ఏవో చంద్రమణి, ఏటీఎంలు డీఆర్ నాయుడు, కె.హరి, డీఎంలు విశ్వనాథం, హరిబాబు, బాలాజీ, భాస్కర్ పాల్గొన్నారు.

24నుంచి ఎస్జీఎఫ్ అండర్ 19 సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 20: ఈనెల 24నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు ఎస్జీఎఫ్ అండర్ 19 క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ అండర్ 19 జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ, బ్యాడ్మింటన్, థైక్వాండో, వాలీబాల్, స్విమ్మింగ్, జూడో, అథ్లెటిక్స్, టెన్నిస్, కరాటే, ఫుట్‌బాల్, రగ్బీ, టెన్నికాయిట్, హ్యాండ్‌బాల్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, బాల్ బ్యాడ్మింటన్ అంశాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 10వ తరగతి మార్కులజాబితా,స్టడీ,ఆధార్ జిరాక్స్‌లు తీసుకురావాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9393621004నెంబరును సంప్రదించాలని కోరారు.

డాక్టర్ అల్లాడికి పురస్కారం



మోహన్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 20: స్విమ్స్ వైద్యశాల జనరల్ మెడిసిన్ విభాగం డీన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లాడి మోహన్‌కు విశిష్ట ఉపాధ్యాయ పురస్కారం లభించింది. శుక్రవారం విశాఖలో జరిగిన భారత ఫిజీషియన్ అసోసియేషన్ 52వ వార్షిక సమావేశాలలో నిర్వాహకులు మోహన్‌ను విశిష్ట ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించారు. విశాఖ ఎంపీ భరత్, నిట్రుస్ వీసీ ఐవీ రావు, ఫిజీషియన్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

అక్కినేనికి ఘన నివాళి



అక్కినేనికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 20: ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి కళాకారులు శుక్రవారం ఘన నివాళి అర్పించారు. ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, సినీ రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన అక్కినేని జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, కొట్టే సుబ్రమణ్యం రెడ్డి, ఫణిభూషణ్ రెడ్డి, మురళి, సుబ్రమణ్య రెడ్డి, గురునాథం నాయుడు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన పోటును నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న కిరణ్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 20: లడ్డూప్రసాదాల తయారీలో నాసిరకం నెయ్యి వినియోగించడంతో అపవిత్రమైన పోటును నూతనంగా నిర్మించాలని లేదా శుభ్రపరచాలని జనసేన తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ దారుణానికి కారకులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

బైక్ రైడర్ అరెస్టు

మోటారు సైకిల్ సీజ్



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 29: రోడ్డుపై స్టంట్‌లు చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు. సీఐ రాంకిషోర్ వివరాల మేరకు... మంచాల వీధికి చెందిన రాఘవేంద్ర రోహిత్ లైసెన్సు లేకుండా బైక్‌ను అతివేగంగా నడుపుతూ ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నాడు. పైగా వింత శబ్దాలు, విచిత్రమైన చేష్టలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. పైగా ఈ వీడియోలను సోషల్ మీడియాలో పెట్టడంతో అలిపిరి సీఐ రాంకిషోర్ అతన్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేశారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20: ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన ఇద్దరు బాలికలను అలిపిరి పోలీసులు శుక్రవారం పోలీసులకు అప్పగించారు. సీఐ రాంకిషోర్ వివరాల మేరకు.. జీవకోనకు చెందిన ఇద్దరు బాలికలు సరిగా చదవకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో అలిగి రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా విజయనగరం జిల్లా పార్వతీపురంలో ఉన్నట్లు గుర్తించి శుక్రవారం అలిపిరి స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు.

రెండూ ఒక్కరికే..!

ఎస్వీయూలో రెండు క్యాంటీన్లకు టెండర్ల కేటాయింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20: రెండు క్యాంటీన్లు ఒకే వ్యక్తికి దక్కడం ఎస్వీయూలో చర్చనీయాంశమైంది. ఇటీవల యూనివర్సిటీలోని అన్నపూర్ణ, సంపూర్ణ క్యాంటీన్లకు టెండర్లు నిర్వహించారు. ఇందుకు పలువురు టెండర్లు వేశారు. దీనిపై శుక్రవారం తుది నిర్ణయం తీసుకున్నారు. అయితే రెండు క్యాంటీన్లకు చంద్రశేఖర నాయుడు అనే వ్యక్తి టెండర్లు దక్కించుకున్నారు. అన్నపూర్ణ క్యాంటీన్ రూ.లక్ష 9 వేలు కాగా, సంపూర్ణ క్యాంటీన్ రూ.46 వేలకు కేటాయించినట్లు తెలుస్తోంది. దీనికి 11 నెలల డిపాజిట్ ముందస్తుగా చెల్లించాక అధికారిక ఉత్తర్వులు వెలువరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏడాది కాల పరిమితికి టెండర్లు కేటాయించినప్పటికీ, టెండరు గడువును పరిస్థితులను బట్టి కొనసాగింపు ఇచ్చే వెసులుబాటు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

నేడు ఏచూరి సంస్మరణ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20: ఎస్వీయూలో శనివారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ఎస్ఎఫ్ఐ చేపట్టనుంది. ఇందులో ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి అరుణ్‌కుమార్, మాజీ, ప్రస్తుత నాయకులు హాజరుకానున్నట్లు జిల్లా అధ్యక్షుడు అక్బర్ తెలిపారు.

పీఎం అవార్డుల ప్రదానం



అవార్డులు ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, పక్కనే డాక్టర్ తిప్పారెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 20: తిరుపతి-రేణిగుంట రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు పీఎం మెరిటోరియస్ అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్రమంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి కలసి విద్యార్థులకు ఈ అవార్డులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు న్యాయవిద్యను పూర్తిచేసి సమాజానికి మెరుగైన న్యాయ సేవలు అందించాలని కోరారు. తాను కూడా ఈ కళాశాల పూర్వ విద్యార్థినేనని, వనరులను ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కాగా మంత్రిని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. బీజేవైఎం జాతీయ మాజీ సెక్రటరీ పి.సురేష్, బీజేపీ నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, వేణుగోపాల్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు డాలర్స్ అభినందన



తిరుపతిరూరల్, సెప్టెంబరు 20: చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చి తిరుగు ప్రయాణంలో శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. విమానాశ్రయంలో మంత్రికి ఘన వీడ్కోలు పలికారు.

85 జీవోను వెంటనే రద్దు చేయాలి



డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20 : పీజీ కౌన్సెలింగ్‌లో పీహెచ్‌సీ వైద్యులకు అన్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ఇచ్చిన 85 జీవోను తక్షణమే రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చత్రప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులతో కలిసి ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. గతంలో పీజీ కౌన్సెలింగ్‌లో పీహెచ్‌సీ వైద్యులకు 30 శాతం మార్కులు వేసే విధంగా ఉండేదని, ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీవో 85తో 15 శాతానికి మాత్రమే పరిమితమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. దీన్ని తక్షణమే రద్దు చేసి, పాత విధానంలోనే పీజీ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా, 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జన్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు.

రేషన్ కాటా యంత్రాల తనిఖీ



యంత్రాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వర్

తిరుపతి రూరల్, సెప్టెంబరు 20 : తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయ భవన ప్రాంగణంలో తూనికల కొలతల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని 20మండలాలకు(తిరుపతిరూరల్, పాకాల) చెందిన రేషన్ కాటా యంత్రాలను తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.మల్లీశ్వర్ నేతృత్వంలో కాటా యంత్రాల పనితీరును పరిశీలించి, ప్రోగ్రామింగ్‌ను లోడ్‌చేసి సీలింగ్ వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా సీల్‌ని ఓపెన్ చేసినట్లు సమాచారం అందితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సిబ్బంది గజేంద్రనాయుడు, రమేష్‌బాబు, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20: ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీ జయనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎమ్మార్ పల్లి సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... సాయినగర్ పంచాయతీ జయనగర్‌కు చెందిన వెంకటస్వామిరెడ్డి 15 ఏళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పలు వ్యసనాలకు లోనైన ఆయన అనారోగ్యం బారినపడ్డాడు. మూడు రోజుల క్రితం చెల్లెలు ఇంటికి వెళ్లి వచ్చాడు. రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరవకపోవడంతో సోదరుడు రమణారెడ్డి వచ్చి తలుపులు పగుల కొట్టి చూడగా ఇంట్లోని రేకుల షెడ్డుకు ఉరేసుకుని కనిపించాడు. రమణారెడ్డి ఫిర్యాదు మేరకు ఎమ్మార్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అన్న క్యాంటీన్లతో పేదల కళ్లలో ఆనందం

అన్నార్తుల కడుపు నింపుతున్న ప్రభుత్వ క్యాంటీన్లు - ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టుగానే పునరుద్ధరణ



తిరుపతి - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : తిరుపతిలో అన్న క్యాంటీన్ల పునః ప్రారంభంతో పేద ప్రజల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. గత ఐదేళ్లుగా కడుపు నింపుకునేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయలేక అల్లాడిన పేదలకు ఆకలి తీర్చే ఆలయాలుగా ఈ ప్రభుత్వ క్యాంటీన్లు దర్శనమిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలతో అర్ధంతరంగా మూసేసిన అన్న క్యాంటీన్లు గురువారం రాత్రి పండుగలా ప్రారంభమైన విషయం విదితమే. నగరంలోని 4 క్యాంటీన్ల వద్ద శుక్రవారం పేదలు పెద్దయెత్తున క్యూ కట్టారు. రూ.5కే రుచి, శుచి, శుభ్రతతో కూడిన అల్పాహారం, భోజనం అందుబాటులోకి రావడంతో కార్మికులు, చిరుద్యోగులు, వివిధ పనులపై నగరానికి వచ్చేవారు ఆకలి తీర్చుకుంటున్నారు. స్విమ్స్ సర్కిల్, ఎమ్మార్‌పల్లి, ఈఎస్ఐ ఆస్పత్రి, న్యూబాలాజీ కాలనీలోని అన్న క్యాంటీన్లలో ఆకలి తీర్చుకుంటున్న వారు ఏమంటున్నారంటే..

వైసీపీది దరిద్రమైన ఆలోచన



నేను ఎమ్మార్‌పల్లిలో కొబ్బరి కాయల పొట్టు చీలుస్తూ, వచ్చిన కూలితో బతుకుతున్నాను. ఇదివరకు చంద్రబాబు తెచ్చిన అన్న క్యాంటీన్లతో రోజుకు రూ.15కు మూడు పూటలా కడుపునిండా తినేవాడిని. తర్వాత జగన్ రెడ్డి వచ్చి వాటిని తీసేశాడు. వైసీపీ వాళ్లది దరిద్రమైన ఆలోచన. హోటల్లో సంగటి అరకొరగా తినేవాడిని. మళ్లీ క్యాంటీన్ రావడం ఎంతో సంతోషంగా ఉంది. మాలాంటి కూలీల పాలిట చంద్రబాబు దేవుడే.

- సుబ్రమణ్యం, కార్మికుడు

మాలాంటి ఒంటరి మహిళకు ఎంతో ఆసరా



నా భర్త చనిపోయాడు. పింఛన్ డబ్బుతో బతుకుతున్నా. ఇదివరకు అన్న క్యాంటీన్లు పెట్టినపుడు మాలాంటి ఒంటరి మహిళలకు ఎంతో ఆసరాగా అనిపించాయి. భోజనం పెట్టే సమయానికి రూ.5 ఇచ్చి అన్నం తినేదాన్ని. జగన్మోహన్ రెడ్డి దుర్మార్గంగా వాటిని తీసేశారు. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ తెరిచారు. ఆయన ఉన్నంతకాలం మాలాంటి వాళ్లకు అన్నం పెడుతూనే ఉండాలి.

- మునిరత్నమ్మ, తిరుపతి

ఇక తిండికి దిగులు లేదు



ఈఎస్ఐ హాస్పిటల్ దగ్గర చిన్న బండి పెట్టుకుని పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నా. చుట్టుపక్కల హోటల్లో భోజనం తినాలంటే ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వచ్చేది. పూలమ్మిన ఆదాయంలో సగం హోటల్‌కే అయిపోయేది. ఇప్పుడు అన్న క్యాంటీన్ వల్ల రూ.15 రూపాయలకే మూడు పూటలా భోజనం దొరకడం చాలా ఆనందంగా ఉంది. నాలాంటి వాళ్లకు తిండికి దిగుల్లేదు.

- సంపూర్ణమ్మ, పూల వ్యాపారి

ఆకలి తీర్చిన చంద్రన్నకు కృతజ్ఞతలు



నేను బేల్దారి పనిచేసుకుంటుంటా. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్న క్యాంటీన్ మూసేయడం వలన భోజనానికి చాలా ఇబ్బందిపడ్డాం. చంద్రబాబు రావడంతో మళ్లీ మాకు అన్న క్యాంటీన్ ఓపెన్ చేయడం, అందరికీ ఐదు రూపాయలకే భోజనం పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఎంతోమంది పేదల ఆకలి తీర్చిన చంద్రన్నకు కృతజ్ఞతలు.

- తిప్పేస్వామి, భవన నిర్మాణ కార్మికుడు

2.7 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20: నగరంలోని జీవకోనలో అలిపిరి పోలీసులు శుక్రవారం 2.7కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా లోతిగడ్డ హరిబాబు, జీవకోనకు చెందిన ముత్తుకూరు గోపీచంద్, వేదాల ఇస్రాయిల్, ఎర్రమిట్టకు చెందిన ఎల్లచందు, అరుణోదయ నగర్‌కు చెందిన ఒక బాలుడు సులభ సంపాదనకు అలవాటుపడి గంజాయి విక్రయించడం ప్రారంభించారు. హరిబాబు శ్రీకాకుళం జిల్లా నుంచి గంజాయిని తిరుపతికి తెప్పించగా ప్యాకెట్లుగా చేసి, కళాశాలలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద విక్రయిస్తున్నారు. రహస్య సమాచారం మేరకు అలిపిరి పోలీసులు జీవకోనలో తనిఖీలు చేపట్టారు. హరిబాబు వద్ద 700 గ్రాములు, మిగతా వారి నుంచి 500 గ్రాముల చొప్పున మొత్తం 2.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా ఏఎన్ఆర్ జయంతి



వృద్ధులకు కేక్ తినిపిస్తున్న కృష్ణ ప్రసాద్

తిరుపతి(ఆటోనగర్) సెప్టెంబరు20: స్థానిక అనంతవీధి కూడలిలోని బలిజసేన కార్యాలయంలో శుక్రవారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పంచిపెట్టారు. 70 ఏళ్ల వయసు దాటిన వారిని సన్మానించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సినీ రంగంలో అక్కినేని ప్రస్థానం గురించి వివరించారు. అభిమానులు గోపీనాథ్, సురేష్, వేణు, ప్రసాద్, చంద్ర, రమణా, చెంగారెడ్డి పాల్గొన్నారు.

బొంతాలమ్మ గుడిలో చోరీ యత్నం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20: తిరుపతి-మంగళం రోడ్డులోని బొంతాలమ్మ గుడిలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆలయం ముందున్న హుండీని పగులకొట్టే ప్రయత్నం చేశారు. స్థానికులు కొందరు ఆ దారిలో వెళ్లడం, ప్రైవేటు బస్సు ఆపరేటర్ల మాటలు వినపడడంతో హుండీని అక్కడే వదలిపెట్టి వెళ్లిపోయారని అలిపిరి సీఐ రాంకిషోర్ చెప్పారు. హుండీలో డబ్బులు చోరీకి గురికాలేదన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం



మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 20: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తోందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా శుక్రవారం జీవకోన పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీలో సమావేశం నిర్వహించారు. వంద రోజుల్లో అమలు చేసిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను స్థానికులకు ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీనీ నెలబెట్టుకుందని తెలిపారు. జీవకోనలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీలు శుభ్రపరచాలని స్థానికులు కోరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తిమ్మినాయుడుపాళెం హరిజనవాడలో కరపత్రాలు, స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, నాయకులు రామకృష్ణ, కుమారమ్మ, అన్నా అనిత, సూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, మహేష్‌యాదవ్, మన్నెం శ్రీనివాసులు, శ్రీనివాస్‌యాదవ్, జనసేన నాయకులు మల్లికార్జున్, రాజారెడ్డి, మాధవరావు, భాను, బాబ్జి, ఆముదాల వెంకటేష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరండి... దేశ పునాదులుగా మారండి : మంత్రి



సభ్యత్వ నమోదులో మంత్రి సత్యకుమార్

తిరుపతి (ఉపాధ్యాయ నగర్), సెప్టెంబరు 20: 'బీజేపీలో చేరండి... దేశానికే పునాదులుగా మారండి' అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తిరుపతి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురితో సభ్యత్వాలను నమోదు చేయించారు. అనంతరం జెండా ఊపి సభ్యత్వ నమోదు రథాన్ని ప్రారంభించారు. 100 మందిని సభ్యులుగా చేర్పించిన వారికి క్రియాశీలక సభ్యత్వం ఇస్తారని చెప్పారు. ప్రతి బూత్‌కు 200 మందిని సభ్యులుగా చేర్చాలనే లక్ష్యంతో పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ముగ్గురి ఎంపిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20: ఢిల్లీలో జనవరి 26వ తేదీన చేపట్టే రిపబ్లిక్ డే పరేడ్‌కు పద్మావతి మహిళా యూనివర్సిటీకి చెందిన ముగ్గురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. యూనివర్సిటీలో శుక్రవారం ఇందుకు సంబంధించిన సెలెక్షన్స్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేశారు. 58 మంది పాల్గొనగా ఆరుగురికి శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహించారు. ముగ్గురిని ఎంపిక చేశారు. వీరికి అవసరమైన శిక్షణ కూడా త్వరలో ఇచ్చే అవకాశం ఉంది. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ విద్యావతి, డాక్టర్ యువశ్రీ, డాక్టర్ వజీహాభాను, స్వాతి, గాయత్రి పాల్గొన్నారు.

ఎస్వీయూ 70ఏళ్ల ప్రస్థానంపై నేడు ప్రత్యేక కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20: ఎస్వీయూ 70 ఏళ్ల ప్రస్థానంపై వర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనుంది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సభలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చెంగ్రాయుడు, పొలిటికల్ సైన్స్ హెడ్ మురళీధర్ పాల్గొంటారని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, డాక్టర్ పి.కల్యాణ్ కుమార్ తెలిపారు.

పుత్తూరు వార్తలు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అడుగులు

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



కరపత్రాల పంపిణీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తదితరులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 20: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అఖండ మెజారిటీతో అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలే, 100 రోజుల పాలన పట్ల 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం పుత్తూరు మున్సిపాలిటీ 4వ వార్డు గుండ్లపుత్తూరులో ' ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలకరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం అంటూ ముద్రించిన స్టిక్కర్లను ఇంటింటికీ అంటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు సకాలంలో అమలు చేసి ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ వైఖరికి రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, మాజీ ఎంపీపీలు మాధవయ్య, ఏలుమలై, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, ప్రతాపరాజు, గణేష్, టీడీపీ బీసీ సెల్ జిల్లా నాయకుడు షణ్ముఖ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో...



కరపత్రాల పంపిణీలో టీడీపీ నాయకులు

వడమాలపేట: రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వడమాలపేటలో కరపత్రాలను పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ అక్రమాలకు వెలికితీస్తూ నష్టపోయినా ప్రజలందరికీ న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎన్నికల హామీలన్ని నెరవేర్చడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాను ప్రకాష్, పంచాయితీ కార్యదర్శి శ్రీలేఖ, టీడీపీ నాయకులు గురునాధం శెట్టి, శివరాయల్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కన్వీనర్‌గా దేవరాజు



వడమాలపేట, సెప్టెంబర్ 20: సీఐటీయూ వడమాలపేట మండల శాఖ అధ్యక్షుడిగా దేవరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ చెప్పారు. వడమాలపేటలో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సభ్యులుగా గంగులమ్మ, కృష్ణవేణి, జయంతి, చంద్రమ్మ, దామోదనం, లోకనాథం, సుభద్రమ్మ, కమల, రుక్మిణి, శ్రీనివాసులు, చిరంజీవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వడమాలపేట, సెప్టెంబర్ 20: మండలంలోని ఐదు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్ రాజు చెప్పారు. వడమాలపేట, పాదిరేడు, అప్పలాయగుంట, ఏఎంపురం, పూడి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడతున్న కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డిల్లీబాబు

పిచ్చాటూరు, సెప్టెంబరు 20: పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బి.డిల్లీబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తుండిన ప్రిన్సిపాల్ శ్రీధర్ వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవడంతో వడమాలపేట జూనియర్ కళాశాలలో పని చేస్తున్న డిల్లీబాబుకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించారు.

వేడుకగా పద్మావతి ఊంజలసేవ



నారాయణవనం, సెప్టెంబర్ 20: నారా యణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్ సే వను శుక్రవారం వేడు కగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మ వార్లకు నిత్యకైం కర్యా లు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయ అధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన స్వచ్ఛభారత్ కార్మికుల దీక్ష

పిచ్చాటూరు, సెప్టెంబరు 20: మండలంలోని అప్పలరాజు కండ్రిగ పంచాయతీలో పని చేస్తున్న తమను రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తొలగించారని స్వచ్ఛభారత్ పంచాయతీ కార్మికులు జ్యోతి, శ్రీనివాసులు వాపోయారు. తమను పనిలోకి తీసుకోవాలంటూ వారు చేస్తున్న దీక్ష నాల్గో రోజుకు చేరుకుంది. వారి దీక్షకు ఏఐటీయూసీ మద్దతు తెలుపుతోంది. ఎంపీడీవో కార్యాలయం వద్ద దీక్షలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపీ స్వచ్ఛభారత్ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు అన్నాదొరై, శ్రీనివాసులు, మునిచంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

పిచ్చాటూరు, సెప్టెంబరు 20: ఇంటి పరిసరాలు పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని విద్యార్థులు నినాదాలు చేస్తూ పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పులిగుంట జడ్పీ హైస్కూలు విద్యార్థులు శుక్రవారం పాఠశాల పరిసర గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని పిలుపునిచ్చారు.

2.7 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20: నగరంలోని జీవకోనలో అలిపిరి పోలీసులు శుక్రవారం 2.7కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా లోతిగడ్డ హరిబాబు, జీవకోనకు చెందిన ముత్తుకూరు గోపీచంద్, వేదాల ఇస్రాయిల్, ఎర్రమిట్టకు చెందిన ఎల్లచందు, అరుణోదయ నగర్‌కు చెందిన ఒక బాలుడు సులభ సంపాదనకు అలవాటుపడి గంజాయి విక్రయించడం ప్రారంభించారు. హరిబాబు శ్రీకాకుళం జిల్లా నుంచి గంజాయిని తిరుపతికి తెప్పించగా ప్యాకెట్లుగా చేసి, కళాశాలలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద విక్రయిస్తున్నారు. రహస్య సమాచారం మేరకు అలిపిరి పోలీసులు జీవకోనలో తనిఖీలు చేపట్టారు. హరిబాబు వద్ద 700 గ్రాములు, మిగతా వారి నుంచి 500 గ్రాముల చొప్పున మొత్తం 2.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం

తడ, సెప్టెంబరు 20: అక్రమంగా తరలిపోతున్న తమిళనాడు రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా తరలి వెళ్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు రహదారిపై నిఘా పెట్టారు. గురువారం అర్ధరాత్రి సమయంలో అక్కంపేట వద్ద నెల్లూరు వైపు వెళ్తున్న రెండు లారీలను పట్టుకుని ఇద్దరు డ్రైవర్లను అదుపులో తీసుకున్నారు. బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు లారీల్లో ఉన్న రూ.12.58 లక్షల విలువైన 42 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్యకు స్వాధీనం చేశారు. లారీ డ్రైవర్లు ఇచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కొండప్ప నాయుడు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.40వేల అపహరణ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20: ఏటీఎం కార్డు మార్చి రూ.40వేలు అపహరించిన ఘటన నాయుడుపేటలో జరిగింది. పట్టణంలోని మూకాంబికాగుడి వీధిలో నివసిస్తున్న ఓ వ్యక్తి నగదు డ్రా చేసేందుకు బజారు వీధిలోని ఓ ఏటీఎంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఓ గుర్తుతెలియని యువకుడు డ్రా చేసి ఇస్తానంటూ కార్డు తీసుకున్నాడు. డబ్బులు రాలేదంటూ వేరే కార్డు ఇచ్చేసి అక్కడ నుంచి ఉడాయించాడు. కొంత సమయం తరువాత రూ.40వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జనసేన నాయకుడి సస్పెన్షన్

వెంకటగిరి, సెప్టెంబరు 20: వెంకటగిరి నియోజకవర్గ జనసేన నేత గూడూరు వెంకటేశ్వర్లుపై ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు శుక్రవారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు ఉత్తర్వులు పంపారు. ఇటీవల గూడూరు వెంకటేశ్వర్లు జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి అజయ్‌పై పలుమార్లు విమర్శలు చేయడమే కాకుండా వెంకటగిరిలో పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరించడంతో పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఈ నెల 30వ తేదీలోగా వివరణ ఇవ్వాలంటూ పార్టీ అధిష్టానం వెంకటేశ్వర్లుకు నోటీసులు జారీ చేసింది. అప్పటి వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుండాలని ఆదేశించింది.

వరద బాధితులకు ఆర్థిక సాయం

వెంకటగిరి, సెప్టెంబరు 20: వరద బాధితుల కోసం జనసేన సీనియర్ నాయకుడు జపాల ప్రకాష్ రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి డీడీ అందించారు. వెంకటగిరిలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే గ్రామ శక్తి పోలేరమ్మ జాతరకు రావాలని పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి వేములపాటి అజయ్ వున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

బాలాయపల్లి, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న ప్రజాహిత నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కరపత్రాలను టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్ కుమార్, ఈవోపీఆర్డీ మోహన్ రాజు, పంచాయతీ కార్యదర్శి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా టీపీవోకు అదనపు బాధ్యతలు



కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న టీపీవో శాంతి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 20: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా టౌన్ ప్లానింగ్ అధికారి శాంతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ గంగా ప్రసాద్ బదిలీపై ఆత్మకూరుకు వెళ్లారు. అప్పటి నుంచి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించలేదు. టీపీవోగా పని చేస్తున్న శాంతికి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడంతో శుక్రవారం ఆమె బాధ్యతలు తీసుకొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గ్రామ కమిటీలు

వాకాడు, సెప్టెంబరు 20: మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ మండల స్థాయిలో తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్‌ఐ, ఇరిగేషన్ ఏఈలు కమిటీగా ఉంటారన్నారు. ఆయా పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి కమిటీగా ఏర్పడి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీసిటీకి ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగరాజన్

శ్రీసిటీ, సెప్టెంబరు 20: శ్రీసిటీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సంస్థ వారి సీఎఫ్‌వో ఎక్సలెన్స్ అవార్డు శ్రీసిటీ ఫైనాన్షియల్ చీఫ్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) ఆర్.నాగరాజన్‌కు దక్కింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన సదరన్ రీజియన్ సీఐఐ సీఎఫ్‌వో ఎక్సలెన్స్ అవార్డుల మూడవ ఎడిషన్‌లో ఈ అవార్డును అందజేశారు. సీఐఐ మాజీ ప్రెసిడెంట్, ఇన్ఫోసిస్ కో ఫౌండర్, యాక్సిలర్ వెంచర్స్ ఛైర్మన్ క్రిస్ గోపాల కృష్ణన్, సీఐఐ సీఎఫ్‌వోఎక్సలెన్స్ అవార్డ్ 2023-24 ఛైర్మన్, భారత్ వోల్వో గ్రూప్ ప్రెసిడెంట్ అండ్ ఎండీ కమల్‌బాలి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. మౌలిక కల్పన రంగంలో ఆర్థిక రంగం నిపుణుడిగా నాగరాజన్ చూపిన ప్రతిభ, కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది.

పోలేరమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 20: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, భక్తులందరికీ అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో జాతర నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం వెంకటగిరి పట్టనంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు జాతర నిర్వహణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎండోమెంట్ ఈవో, మున్సిపల్ కమిషనర్, ఆర్అండ్‌బీ, పోలీస్ శాఖ పటిష్టమైనా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దర్శనార్థం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూలైన్లు ఉంటాయన్నారు. గూడూరు డీఎస్పీ మాట్లాడుతూ జాతరలో 1200 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. 7 సెక్టార్లుగా విధులు నిర్వహిస్తూ ఎటువంటి అసౌర్యాలకు తావులేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, 300 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని వివరించారు. వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు 80 బస్సులు నడుపుతున్నామని డీఎం తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ.... గతంలో ఎన్నడూ నిర్వహించి విధంగా ఈ ఏడాది అమ్మవారి జాతర కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించాలన్నారు. పట్టణంలో ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రవిమనోహరాచారి, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఘటోత్సవం

పోలేరమ్మ జాతర ఘటోత్సవంతో ఆదివారం ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 3గంటలకు పనిబాటల వారు ఘటోత్సవాన్ని ప్రారంభిస్తారు. తరువాత వచ్చే బుధ, గురువారాల్లో పోలేరమ్మ జాతర నిర్వహిస్తారు.

కూటమిది ప్రజారంజక పాలన: ఎమ్మెల్యే విజయశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మండలంలోని పుదూరులో శుక్రవారం రాత్రి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పింఛను రూ.4వేలకు పెంపు, టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభించినట్లు వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూనే, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాబోవు కాలంలో సంపూర్ణ సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇక సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా మంజూరైన రూ.12 కోట్లతో అభివృద్ధి పనులను చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వరదలు వచ్చిన సమయంలో హెలి కాప్టర్‌లోనే ఏరియల్ సర్వే నిర్వహించి ప్రజలను కలవకుండానే వెళ్లిన సంఘటనలు ప్రజలు మరచిపోలేదన్నారు. సీఎం చంద్రబాబు వయస్సును లెక్కచేయకుండా వరద బాధితులను సహాయ సహకారాలు అందించడం ప్రజలు గుర్తించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు గీతావాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో శర్మ, ఎంఈవో మునిరత్నం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాసులునాయుడు, విజయకుమార్ నాయుడు, రామిరెడ్డి, పార్థసారథి, రత్నం, పళణి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకే పోటీలు



షాట్‌పుట్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో సనత్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 20: విద్యార్థుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం పోటీలను నిర్వహిస్తోందని ఎంఈవో సనత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల పాటు అండర్-14, అండర్-17 విభాగాల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కబాడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను ఎంపికచేసి ఈనెల 26న కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పీఈటీలు కరిముల్లాఖాన్, సుబ్రహ్మణ్యం, శివకుమార్ పాల్గొన్నారు.

చిల్లకూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలను ఎంఈవోలు సతన్‌కుమార్, రఫూఫ్ ప్రారంభించారు. హెచ్ఎం జాన్‌పీటర్, పీడీ లు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం విశ్వకర్మ' పథకం ఒక వరం

- సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సత్యకుమార్ పిలుపు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 20: కులవృత్తులు చేసుకునేవారికి గొప్ప వరమైన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. చేతివృత్తులపై ఆధారపడే లక్షలాదిమందికి అండగా నిలిచేందుకు ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. 18 రకాల చేతివృత్తుల వారికి ఈ పథకం ద్వారా నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఆర్థికంగా తోడ్పానందించి, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రధాని సహకారంతో విశ్వకర్మ పథకంతోపాటు మరిన్ని పథకాలకు, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం పీఎం విశ్వకర్మ, నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులకు మంత్రి, ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. దీనికిముందు చేతివృత్తుల కళాకారులు ఏర్పాటుచేసిన కళాప్రదర్శనశాలలను సందర్శించి కళారూపాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఈడీ దినేష్‌కుమార్, యూనియన్ బ్యాంక్ డీజీఎం రాంప్రసాద్, డీఐసీ జీఎం ప్రతాప్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ ప్రభావతి, ఎల్డీయం విశ్వనాథరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

మమ.. అనిపించారు!

- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి గైర్హాజరైన పలువురు అధికారులు, జడ్పీటీసీలు
- కోరం లేకుండానే రెండు సమావేశాల నిర్వహణ



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం తూతూ మంత్రంగా నిర్వహించారు. 1 నుంచి 7 సమావేశాలను ఒక్కో దగ్గర నిర్వహించారు. ఇందులో రెండు సమావేశాలను కోరం లేకుండానే ముగించారని విమర్శలు వస్తున్నాయి. రెండు గంటల్లోనే సమావేశాలన్నిటినీ ముగించారు. వివిధ శాఖలకు సంబంధించిన జిల్లాస్థాయి అధికారులు ఒకరు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యులు కూడా కొందరే వచ్చారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, కొందరు సభ్యులు కొన్ని సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా.. చిత్తూరులో అమూల్ డెయిరీ ప్రారంభమైనా పాల సేకరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరులో జాప్యాన్ని నివారించాలని కోరారు. వి.కోట ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రైతే వైద్యులు ఉండడం లేదని చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా, జడ్పీ వైస్ ఛైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ పర్యటనే కారణమా?

బంగారుపాళ్యంలో మంత్రి లోకేశ్ పర్యటన కారణంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి దాదాపుగా జిల్లా స్థాయి అధికారులు హాజరు కాలేనట్టుగా తెలుస్తోంది. ఇక ఎమ్మెల్యేలు కూడా మంత్రి కార్యక్రమంలో ఉండడంతో సమావేశానికి హాజరుకాలేకపోయారు. జడ్పీటీసీలైతే స్టాండింగ్ కమిటీనే కదా అని లైట్‌గా తీసుకున్నారు.

డాక్టర్ అల్లాడికి పురస్కారం




తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 20: స్విమ్స్ వైద్యశాల జనరల్ మెడిసిన్ విభాగం డీన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లాడి మోహన్‌కు విశిష్ట ఉపాధ్యాయ పురస్కారం లభించింది. శుక్రవారం విశాఖలో జరిగిన భారత ఫిజీషియన్ అసోసియేషన్ 52వ వార్షిక సమావేశాలలో నిర్వాహకులు మోహన్‌ను విశిష్ట ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించారు. విశాఖ ఎంపీ భరత్, నిట్రుస్ వీసీ ఐవీ రావు, ఫిజీషియన్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

85 జీవోను వెంటనే రద్దు చేయాలి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20 : పీజీ కౌన్సెలింగ్‌లో పీహెచ్‌సీ వైద్యులకు అన్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ఇచ్చిన 85 జీవోను తక్షణమే రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చత్రప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులతో కలిసి ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. గతంలో పీజీ కౌన్సెలింగ్‌లో పీహెచ్‌సీ వైద్యులకు 30 శాతం మార్కులు వేసే విధంగా ఉండేదని, ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీవో 85తో 15 శాతానికి మాత్రమే పరిమితమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. దీన్ని తక్షణమే రద్దు చేసి, పాత విధానంలోనే పీజీ కౌన్సెలింగ్ నిర్వ హించాలన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా, 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జన్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధికి పచ్చజెండా

ఎస్వీయూ పాలకమండలిలో పలు తీర్మానాలు



సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20: ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధికి పచ్చజెండా ఊపుతూ పాలకమండలి పలు తీర్మానాలు చేసింది. యూనివర్సిటీలో శుక్రవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ సాగింది. పలు తీర్మానాలకు ఆమోదం లభించింది. సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ రామ్మోహనరావు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ కోల మంజుల, ప్రొఫెసర్ సుగుణమ్మ, ప్రొఫెసర్ పద్మనాభం, మొహిద్దీన్ బాషా, నారాయణబాబు పాల్గొన్నారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్, ప్రొఫెసర్ సుమకిరణ్, ఆర్థిక శాఖ ఉప కార్యదర్శి ఆదినారాయణ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

తీర్మానాలివే..

- మైక్రో బయాలజీ భవన నిర్మాణానికి రూ.1.02 కోట్ల నిధుల కేటాయింపు
- ఫార్మసీ భవన నిర్మాణానికి రూ.2. 8 కోట్ల కేటాయింపు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్) ఏర్పాటుకు నిర్ణయం
- క్యాంపస్ స్కూల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.76. 80 లక్షల మంజూరుకు తీర్మానం
- పరిపాలనా భవనంలో గల నాలుగు అంతస్తుల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.85 లక్షల కేటాయింపు
- ఇంజినీరింగ్ విభాగంలో పదోన్నతులు కల్పించేందుకు చర్యలకు ఆదేశం
- దూరవిద్యా స్టడీ మెటీరియల్ ప్రింటింగ్ పెండింగ్ బిల్లుల విడుదల
- టీటీడీకి చెందిన మూడు కాలేజీలతో పాటు నగరి, చిత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా కల్పిస్తూ నిర్ణయం
- యూనివర్సిటీ దూరవిద్యా విభాగానికి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ లెర్నింగ్‌గా పేరు మారుస్తూ తీర్మానం
- దూరవిద్యా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు ఆమోదం

బీజేపీలో చేరండి... దేశ పునాదులుగా మారండి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 20: 'బీజేపీలో చేరండి... దేశానికే పునాదులుగా మారండి' అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తిరుపతి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురితో సభ్యత్వాలను నమోదు చేయించారు. అనంతరం జండా ఊపి సభ్యత్వ నమోదు రథాన్ని ప్రారంభించారు. 100 మందిని సభ్యులుగా చేర్పించిన వారికి క్రియాశీలక సభ్యత్వం ఇస్తారని చెప్పారు. ప్రతి బూత్‌కు 200 మందిని సభ్యులుగా చేర్చాలనే లక్ష్యంతో పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఆధునిక సాంకేతికతతో స్థిర ఆర్థికాభివృద్ధి

నీతి ఆయోగ్ సభ్యుడు సరస్వత్


సమావేశంలో మాట్లాడుతున్న సరస్వత్

ఏర్పేడు, సెప్టెంబరు 20: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సరస్వత్ అన్నారు. 'సుస్థిర ఆర్థికాభివృద్ధికి నూతన సాంకేతికత' అనే అంశంపై తిరుపతి ఐఐటీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా దేశ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కొత్తపరిశోధనలు, ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. స్థిరమైన ఆర్థికాభివృద్ధిని నడపడానికి ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్‌పై నీతి ఆయోగ్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. అంతకుముందు డాక్టర్ సరస్వత్ స్వచ్ఛ సేవ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు హాజరయ్యారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కనక దుర్గమ్మకు విశేష పూజలు

ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ మూలమూర్తికి రాహుకాలంలో విశేష అభిషేకాలు చేశారు. సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవికి శుక్రవారం సందర్భంగా రాహుకాలంలో మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

గూడ్స్ రైలు పార్కింగ్ పనులు వేగవంతం



రేణిగుంట, సెప్టెంబరు 20: రేణిగుంట రైల్వేస్టేషన్ ఆవరణలో జరుగుతున్న గూడ్స్ రైలు పార్కింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రేణిగుంట రైల్వేస్టేషన్ మీదుగా రోజూ దాదాపు 300 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పాటు గూడ్స్ రైల్లో వచ్చే సరుకులను పాత గూడ్స్ షెడ్ వద్ద దింపేవారు. అదే మరో గూడ్స్ రైలు వస్తే పట్టాలపై వేచి చూడాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులు మరో గూడ్స్ రైలు పార్కింగ్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

ఎస్ఎస్ పురం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగలాపురం, సెప్టెంబరు 19: మండలంలోని ఎస్ఎస్ పురానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు పడింది. బుధవారం 'రూ. వంద ఇస్తేనే మస్టర్ వేస్తా' అన్న కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. ఈ కథనంపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో బాబు, ఏపీవో సుధాకర్ గురువారం ఎస్ఎస్‌పురం గ్రామానికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టారు. ఉపాధి కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్ మాధవ్ డబ్బులు డిమాండ్ చేసిన వీడియో ఆధారంగా నిజాన్ని నిర్ధారించుకుని కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

రేణిగుంటలో కబ్జాలపై కమిటీ: ఎమ్మెల్యే సుధీర్


ఇది మంచి ప్రభుత్వం పోస్టర్ల ఆవిష్కరణలో బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు

రేణిగుంట, సెప్టెంబరు 20: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల కబ్జాలపై కమిటీ వేస్తున్నామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తారకరామానగర్‌లో జరిగిన ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగిన కబ్జాలను తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి స్వాధీనం చేసుకుని కట్టడాలను కూల్చివేస్తామన్నారు. ఎక్కడా లేని విధంగా ఫ్రీహోల్డ్ యాక్ట్‌ను అడ్డుపెట్టుకుని 9,385 ఎకరాలు ముందుగా అగ్రిమెంటు చేసుకున్నారన్నారు. కేవలం ఒకే వ్యక్తి 395 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఈ విషయంపై విచారణ జరుగుతుందన్నారు. రేణిగుంట మండలంలోని విప్పిమానుపట్టెడ తుడా ప్లాట్స్ పన్నులు రూ.85కోట్లు రావాల్సి ఉందని, త్వరలో తుడా వీసీని కలిసి ఆ నిధులను రేణిగుంట మండల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. టీడీపీ మండల పట్టణ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుంటే దున్నేస్తాం

ఏర్పేడు, సెప్టెంబరు 20: గత ప్రభుత్వం టీటీడీ ఉద్యోగుల కోసం తమ భూములు సేకరించిందని, అయితే పరిహారం చెల్లింపులో పక్షపాతధోరణి ప్రదర్శించిందని పల్లం, పల్లంపేట దళిత, గిరిజనులు చెప్పారు. పల్లం గిరిజన కాలనీలో జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు మాట్లాడుతూ... వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులకు మాత్రమే గత ప్రభుత్వం పరిహారం అందించిందన్నారు. 30 కుటుంబాల వారికి పరిహారం చెల్లించకపోతే భూములు దున్నుకుంటారన్నారు. పరిహారం ఇవ్వకపోతే తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద అవినీతి అధికారుల భాగోతాన్ని బట్టబయలు చేస్తామని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య అన్నారు. చిన్నం కాళయ్య, మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పట్టణ మాజీ అధ్యక్షుడి రాజీనామా


కొట్టెడి మధు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: నియోజకవర్గ వైసీపీ నాయకుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు కొట్టెడి మధుశేఖర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పాలనలో తిరుమల లడ్డూకు వినియోగించే నెయ్యిపై వస్తున్న ఆరోపణలు నేపథ్యంలో ఆవేదనతో రాజీనామా చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎంతో ప్రీతిపాత్రమైన తిరుమల లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వినియోగించడం బాధాకరమన్నారు. ఈ కుంభకోణంలో ఎవరి పాత్ర ఉందో విచారణ జరిపి వారందరినీ కఠినంగా శిక్షించాలని కూటమి ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

వైసీపీ హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు: లోకేశ్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

రేణిగుంట, సెప్టెంబరు 20: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై తప్పనిసరిగా చర్యలుంటాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యంలో కార్యక్రమం ముగించుకుని తిరుగు ప్రయాణంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ... తిరుమల పవిత్రతను ఎన్టీఆర్ హయాం నుంచి సీఎం చంద్రబాబు వరకు చిత్తశుద్ధిలో కాపాడుతు వచ్చారన్నారు. అలాంటిది వైసీపీప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యి విషయంలో ల్యాబ్ టెస్ట్ ద్వారా జంతువుల కొవ్వు పదార్థాలున్నాయని నిర్ధారణ అయిందన్నారు. ఈ విషయంపై తప్పనిసరి చర్యలు ఉంటాయన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేసేందుకే టీటీడీ ఈవోతోపాటు ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. ప్రకాశం బ్యారేజీ గేట్లను గుద్దే బోట్లను పంపడం నీచ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. విజయవాడ వరదల సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.400 కోట్లు వస్తే, కూటమి ప్రభుత్వం రూ.వెయ్యికోట్లు ఖర్చు చేసిందన్నారు. ముంబై సినీ నటి అరెస్టు విషయంలో తాడేపల్లి సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయని విచారణలో స్పష్టంగా బయట పడిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమపై జగన్ ఫేక్ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో పెన్షన్‌ను ఆయన మూడ్ వచ్చినపుడు పెంచాడని, అదు సీఎం చంద్రబాబు ఒకేసారి పెంచి ఇచ్చారన్నారు. నాడు జగన్ పాలనలో ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిశ్రమలతో ఎంవోయూలు కదుర్చుకున్నామన్నారు. వైవీ సుబ్బారెడ్డి సవాల్‌ను స్వీకరించి 24గంటలు అవుతున్నా ఇప్పటి వరకు స్పందించ లేద న్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలను ఇబ్బం దులకు గురిచేసిన ప్రతి ప్రభుత్వ అధికారిపై విచారణ చేయిస్తామన్నారు. అనం తరం ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు. రవాణా శాఖ మం త్రి రాంప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దుగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్, గాలి భానుప్రకాష్, తిరుపతి, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు నరసింహయాదవ్, సీఆర్ రాజన్, నాయకులు శ్రీధర్‌వర్మ, మబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు నిరుపేదలకు వరం


రామసేతు అన్నక్యాంటీన్‌లో అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: రూ.5కే ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు పేదలకు వరమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో రామసేతు వంతెన వద్ద, ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్లను ఆయన ప్రారంభించారు. ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐదేళ్ల క్రితం అన్న క్యాంటీన్లు పేదల ఆకలి తీరిస్తే ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని మూత వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు రూ.18 లక్షలతో రెండింటినీ బాగు చేయించామన్నారు. వైసీపీ ప్రజా హితం మరిచి పైశాచిక పాలన సాగించిందన్నారు. అన్నార్తులు అలమటించకూడదన్న ఆశయంలో సీఎం చంద్రబాబు రూ.5కే ఆహారం అందిస్తున్నారన్నారు. అనంతరం సామాన్యులతో పాటు టోకెన్లు కొనుగోలు చేసి అల్పాహారం తిన్నారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ రాష్ట్ర అధి కార ప్రతినిధి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయ కుమార్, నాయకులు చెంచయ్య నాయుడు, ప్రకాష్‌నాయుడు, సురేష్‌నాయుడు, ప్రసాద నాయుడు, వెంకటరత్నంనాయుడు, జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఇది మంచి ప్రభుత్వం'


ఇందిరానగర్‌లో, బీఎన్‌కండ్రిగలో, సత్యవేడులో కరపత్రాల పంపిణీ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 20: మండలంలోని అంబూరు పంచాయతీలో ఎన్ఆర్ఐ ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తైన సందర్భంగా ప్రభుత్వ పాలనపై ప్రజలకు వివరించే 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలపతినాయుడు, మునిచంద్రారెడ్డి, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, నిరంజన్‌రెడివ్వ, నరేష్‌రెడ్డి, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బీఎన్‌కండ్రిగ సచివాలయ పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు ఆధ్వర్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినందని నాయకులు కొనియాడారు.. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, గోపి, బాబునాయుడు, కార్యదర్శి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను ఆవిష్కరించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, ఎంపీడీవో రాధారాణి, ఎంఈవో యుగంధర్‌రాజు, సూపరింటెండెంట్ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: కేవీబీపురం సచివాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ రోజుల్లో ఎక్కువ అభివృద్ధి చేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. గోపీనాథరెడ్డి, సురేష్‌రెడ్డి, సాధు, థామస్, ఈవోపీఆర్డీ సాగర్, కార్యదర్శి గోవిందస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సత్యవేడులో సచివాలయం2 పరిధిలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్ళి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ మునిరవి కుమార్, టీడీపీ నాయకులు షణ్ముగం, సురేష్, దావూద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సచివాలయం3 పరిధిలో టీడీపీ నాయకుడు చిన్న, సచివాలయం 4 పరిధిలో ఐటీడీపీ కన్వీనర్ దిలీప్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రియురాలిపై మోజుతో ఇంటినుంచి భార్య గెంటివేత

- న్యాయం కోసం తల్లితో కలిసి నిరసన


భర్త ఇంటి ముందు తల్లితో కలిసి మంజుల నిరసన

ఏర్పేడు, సెప్టెంబరు 20: పెద్దల సమక్షంలో అగ్నిసాక్షిగా తాళి కట్టిన భార్యను ప్రియురాలి మోజులో ఓ భర్త ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. మండలంలోని మడిబాక పంచాయతీ రాజులకండ్రిగకు చెందిన మంజులకు అదే గ్రామానికి చెందిన భాస్కర్‌రాజుతో 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కుమార్తె , కుమారుడు ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహమైంది. అయితే భాస్కర్‌రాజు రెండేళ్ల నుంచి వేరే మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడు. దీన్ని ప్రశ్నించిన భార్యపై దాడి చేసేవాడు. మూడు నెలల క్రితం దీనిపై మంజుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈక్రమంలో గ్రామ పెద్దలు మధ్యస్తం చేసి భాస్కర్‌రాజుకు ఉన్న రెండిళ్లలో ఒక ఇంటిని ఆమెకు ఇవ్వాల్సిందిగా తీర్మానించారు. అలాగే భాస్కర్‌రాజు చేసిన రూ.20 లక్షల అప్పుడు తీర్చడానికి ఉన్న నాలుగు ఎకరాల్లో ఎకరా విక్రయించడానికి తీర్మానించారు. మిగిలిన మూడు ఎకరాల్లో భర్తకు ఒకటిన్నర, భార్యకు ఒకటిన్నర ఎకరా కేటాయించి ఈ మేరకు వీలునామా పత్రం రాశారు. అయితే ఆ వీలునామాలో మంజుల తదనంతరం ఆ ఇల్లు భర్తకు చెల్లే విధంగా రాశారు. భాస్కర్‌రాజుకు కేటాయించిన ఇల్లు అతని తదనంతరం కుమారునిడే చెందే విధంగా రాయాలని ఆమె పట్టుబట్టింది. దీంతో పెద్దల సమక్షంలో ఒప్పుకున్న భాస్కర్‌రాజు మరుసటి రోజు అంగీకరించలేదు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య వివాదం నడుస్తూనే ఉంది. అయితే గత రెండు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న మంజుల ఆస్పత్రికి వెళ్లడంతో భాస్కర్ రాజు ఆమె ఇంటికి తాళం వేశాడు. ఇంటికి వచ్చిన మంజుల భర్త నివసిస్తున్న ఇంటికి తాళం వేసింది. దీంతో అప్పటి నుంచి మంజుల, భాస్కర్‌రాజు, కుమారుడు బయటే ఉంటున్నారు. శుక్రవారం ఉదయం మంజుల తనకు న్యాయం చేయాలంటే తన తల్లితో కలిసి భర్త ఇంటి ముందు నిరసనకు దిగింది. ఫోన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



బుచ్చినాయుడు కం డ్రిగ, సెప్టెంబరు 20: మండలం లోని పల్లమాల కాళంగి నది నుంచి అనుమతులు లే కుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కాటూరు దగ్గర ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై కఠిన చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: శ్రీవారి లడ్డూ కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ధన దాహంతో దోపిడీకి అలవాటు పడి ప్రజా సంపదను దోచుకోవడానికి ధర్మవిరుద్ధంగా అస్తవ్యస్త నిర్ణయాలతో టీటీడీలో దోపిడీకి పాల్పడ్డారన్నారు. నెయ్యి కల్తీతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమేష్‌రావు, ఎన్. బుజ్జి, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, సునీల్, భాస్కర్, శివ, మణి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఎస్‌లో రైల్వే ఉద్యోగులకు క్రికెట్ పోటీలు

రేణిగుంట, సెప్టెంబరు 20: స్థానిక సీఆర్ఎస్‌లో రైల్వే ఉద్యోగులకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. శుక్రవారం సీఆర్ఎస్ వెస్ట్ కాలనీలోని మైదానంలో సీఎంఈ, సీఎండబ్ల్యూఎం జట్లు తలపడ్డాయి. ఇందులో సీఎండబ్ల్యూఎం జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూ దేసహాయం, డిప్యూటీ సీఎంఈ రమేష్, సీఆర్ఎస్ యూనియన్ నాయకులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు శ్రీకాళహస్తి విద్యార్థులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ అండర్-19 పోటీలకు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు శుక్రవారం బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ.. తమ పాఠశాలకు చెందిన 8మంది విద్యార్థులు విజయవాడలో జరిగే పోటీల్లో ప్రాతినిధ్య వహిస్తున్నారని చెప్పారు.

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడులు

ఏర్పేడు, సెప్టెంబరు 20: మండలం కందాడులో ఉద్యానాధికారి పుష్పలత ఆధ్వర్యంలో మామిడితోటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సెప్టెంబరులో తొలకరి వర్షాలు పడిన వెంటనే తోటల్లో లోదుక్కులు చేసుకుంటే చెట్లకు నీరు అందుతుందన్నారు. అలాగే కొమ్మలను కత్తిరించాలని సూచించారు. ఏ సమయంలో ఏ మందులు వాడాలో రైతులకు వివరించారు. ఆయిల్ పాంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ ఉద్యాన సహాయ కుడు చంద్ర, కందాడు, ముసలిపేడు, రాజులకండ్రిగ రైతులు పాల్గొన్నారు.

దళితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

కేవీబీపురం, సెప్టెంబరు 20: మండలంలోని ఇటీవల పెరిందేశం, రాగిగుంట గ్రామాల మధ్య జరిగిన గొడవల్లో దళితులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని దళిత బహుజన పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు తలారి బత్తెయ్య మాట్లాడుతూ అగ్రవర్ణాల వారు దళితులపై దాడి చేస్తే దళితులపైనే కేసులు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి దళితులపై పెట్టిన కేసులను ఎత్తివేసి న్యాయంచేయాలని కోరారు.

ఎన్టీఆర్ చిత్రపటం బహూకరణ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి మార్గంలో శుక్రవారం అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొట్టంబేడు మండలం శేషమ నాయుడు కండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాలి వెంకట్రామనాయుడు ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు. వెంకట్రామనాయుడు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మరి ఆ ఇళ్ల సంగతేంటి?


వికృతమాలలో నిర్మించిన అక్రమ కట్టడం

ఏర్పేడు, సెప్టెంబరు 20: మండలంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వే నెం.51లో అక్రమార్కులు అప్పటి ఎమ్మెల్యే సహకారంతో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అందులో మండల స్థాయి వైసీపీ నేతలు ఇద్దరు ఉన్నారు. వీరిద్దరు భారీ స్థాయిలో ఆ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. సుమారు 30గదులు వరకు నిర్మించి ఉన్నారు. వాటిని తొలగించాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం వైసీపీ నేతలు నిర్మించిన అక్రమకట్టడాలను కూల్చడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా దళిత వర్గానికి చెందిన వైసీపీ నేత రామ్మూర్తి కట్టిన ఇళ్లను మాత్రమే కూల్చారు. మిగిలిన మండల స్థాయి వైసీపీ నేతలు కట్టిన అక్రమ కట్టడాలను అధికారులు తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నారు.

అగ్రవర్ణాల దాడిపై సమగ్ర దర్యాప్తు చేపట్టండి


వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: కేవీబీపురం మండలం అంజూరుపాళెం అరుంధతి వాడపై అగ్ర కులస్థులు దాడి చేసి దళితుల ఇళ్లు, ఆస్తులు ధ్వంసం చేయడమే కాకుండా వారిని గాయపరిన ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అంజూరుపాళెం ఘటనపై స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నేతలు శుక్రవారం ధర్నా చేపట్టారు. దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదుచేసి వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జనార్దన్ డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. గంధం మణి, పి.గురవయ్య, వేణు, నాగరాజు, సుబ్రహ్మణ్యం తదితరుల పాల్గొన్నారు.

నేడు పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం మల్లంలోని శ్రీవల్లీ దేవసేనత సమేత సుబ్రహ్మణ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.